

# శత్రువులెవరు ?

అత్తాకోడళ్ళు ఆజన్మ శత్రువులనే మాట అనూరాధ ఎప్పుడూ నమ్మలేదుగానీ అత్తాకోడళ్ళకు శత్రుత్వం మగవాళ్ళ వల్లే వస్తుందనే మాటకూడా నమ్మలేదు. మగవాళ్ళను సర్వానర్థాలకూ కారకులుగా ఆడిపోసుకునే స్వభావం కాదు ఆమెది. అలా ఆడిపోసుకునే వాళ్ళంటే కాస్తంత వెక్కిరింత కూడా -

అలాంటి అనూరాధకు ఇవాళ తన అత్త వీరమ్మతో వున్న సంబంధం గురించి చూస్తే - ఏముందక్కడ ?

అది ముక్కలు ముక్కలుగా తెగిపోయింది. మళ్ళీ అతికించటానికి వీలే లేదన్నట్లుగ తెగిపోయింది. తెగిపోతున్నదనే స్పృహ అనూరాధకే మాత్రం లేకుండా అత్యంత చాకచక్యంతో, నేర్పరితనంతో, నాజూగ్గా ఆ పని జరిగిపోయింది.

ఈ విషయం ఆ ఇంటికి చుట్టంచూపుగా వచ్చిన అనూరాధ చెల్లెలు పుణ్యవతికి వచ్చిన పది నిమిషాల్లోనే అర్థమైపోయింది.

"పోయినేడాది వేసవి శలవల్లో అక్క ఇట్లా లేదే - ఎందుకిలా జరిగింది ? ఏమయింది వీళ్ళిద్దరి మధ్యా" అనుకుంది ఆశ్చర్యంగా.

పదేళ్ళుగా అత్తగారిని అబ్బురంగా చూసుకుంటున్న అనూరాధంటే పుణ్యవతికి చాలా అడ్మిరేషన్.

"మీ అత్తా కోడళ్ళిద్దరూ చాలా అరుదైన మనుషులు" అనేది.

"ఏంటో విచిత్రం" అని వేడెక్కిన బుర్రను చల్లార్చటం కోసం తలస్నానానికి బయల్దేరింది పుణ్యవతి.

అనూరాధ తన చెల్లెలు వచ్చిన సందర్భంగా స్పెషల్ చేసే పనిలో తలమునకలుగా వుంది. పది నిముషాలపాటు ఏకాగ్రతతో పనిచేసి బేసిన్ నిండా సర్దిన వెజిటబుల్ బిర్యానీని తృప్తిగా చూసుకుంది.

"చూడటానికి కలర్‌ఫుల్‌గా బాగానే వుంది - రుచి మాటేమిటో" అనుకుంటూ కాస్త భయ సందేహాలతోనే చిన్న ముద్ద తీసుకుని నోట్లో వేసుకుంది.

"అమ్మయ్య - అన్నీ సరిగ్గా సరిపోయాయి" నిట్టూర్చింది.

అప్పటికే ఏడున్నరయింది. భర్తా, పిల్లలూ తెలుగు వార్తల కోసం టి.వీ. ముందు చేరారు.

"ఆవిడగారికి పెట్టేస్తే సరి - ఆవిడగారు తినేసరికి వార్తలయిపోతాయి. అందరం తినేయ్యొచ్చని" అనుకుని ఇంత బిర్యానీ ప్లేటులో పెట్టుకెళ్లి అత్తగారికి ఇచ్చింది అనూరాధ. మళ్ళీ వంట గదిలోకొచ్చి మంచినీళ్ళు ఇవ్వబోతుండగానే వీరమ్మ అరిచింది.

"మంచినీళ్ళు పట్రా ..... మంచినీళ్ళు"

"అన్నం పెట్టిన దాన్ని మంచినీళ్ళు ఇవ్వనూ...ఊరికే అరుపులు, చచ్చిపోతున్నాను" విసుక్కుంటూ గ్లాసు తీసికెళ్ళింది. పోయినేడాది, పోయినేడాదేమిటి గత ఐదారేళ్ళుగా వీరమ్మ అలా కేక పెట్టటం, దానికి అనూరాధ నవ్వుకుంటూ -

"నా మతిమరుపు సంగతి మా మేనమామ తర్వాత మా అత్తకే బాగా తెలుసు. అందుకని ఏ పనీ 'చేస్తుందిలే' అని నా జ్ఞాపకశక్తికి ఒదలకుండా గుర్తు చేస్తుంటుంది" అని మురిసిపోవటం పుణ్యవతికి తెలుసు.

ఈ విసుక్కోవటం పుణ్యవతికి చాలా కొత్తగా వుంది. మంచినీళ్ళ గ్లాసు అత్తగారి ప్రక్కనే పెట్టింది అనూరాధ.

"బంగాళా దుంపలు వెయ్యలేదేం?"

అప్పటికే రెండు ముద్దలు బిర్యానీ తిన్న వీరమ్మ కోడల్ని అడిగింది.

"ఏం బంగాళా దుంపలు లేకపోతే ముద్ద దిగదా ?" అనూరాధ కంఠంలోని కరుకుదనానికి పుణ్యవతి బిత్తరపోయింది.

"బంగాళా దుంపలు కావాలట. ఏనాడైనా బిర్యానీ చేసిన మొహమైతేగా - ఎంత బాగా చేసినా ఏదో ఒక వంక పెట్టందే వూరుకోదు" గొణుగుతూనే వుంది.

మళ్ళీ అన్నం, పెరుగూ వడ్డించటానికి వెళ్ళినపుడు వీరమ్మ అదే ప్రశ్న అడిగింది. వీరమ్మ ఏ విషయాన్నీ తెలుసుకోకుండా వూరుకోదు.

అనూరాధకు కోపం తలకెక్కింది గానీ చేసేది లేక "దుంపకూరలు తినకూడదు. ఒంటికి మంచిది కాదు" అని చెప్పింది విసురుగానే అయినా.

"ఆ -ఒక్క దుంపకేమయింది ? ఆ వాసనా తగిలేది" అంది వీరమ్మ.

అనూరాధ ఆ గదిలోంచి చరచరా బైటికొచ్చింది.

"అసలు ఒండింది పెట్టటం తప్పయింది. మామూలుగా ఇంత అన్నం,కూరా పెట్టేస్తే పీడా పోయేది. నోరెత్తకుండా తినేది. పోన్లే పాపం అని వేడి వేడిగా పెడితే వంకలు పెడుతోంది" పెద్దగానే అంటూ వంట గదిలోకి వచ్చింది.

"ఏంటక్కా - ఏంటి అంత విసుగ్గా వున్నావు" పుణ్యవతి ఇక జోక్యం చేసుకోకుండా వుండలేకపోయింది.

"ఏముందీ - చెయ్యలేక చస్తున్నా ముసలావిడకి - ఎంత చెయ్యి - తృప్తిలేదు. వంకలు పెడుతూనే వుంటుంది" అత్తగారిమీద కత్తులు నూరబోయింది అనూరాధ.

ఇంతలో పిల్లలు ఆకలంటూ అన్నాలకు వచ్చేశారు.

అందరూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు ముగించారు.

"అక్కా - కాసేపు చల్లగాలికి డాబా మీద కూర్చుందామా" అంటూ చాప తీసుకుని డాబామీదకు నడిచింది పుణ్యవతి. ఆ వెనకే వక్కపొడి తీసుకుని అనూరాధ వచ్చింది.

ఆ కబురూ ఆ కబురూ చెబుతూ అసలు అడగాలనుకుంటున్న ప్రశ్న అడిగేసింది పుణ్యవతి.

"ఎందుకక్కా - ఆ ముసలమ్మ మీద అంత కత్తి కట్టావు?"

"బాగుంది. నేనేం చేశాను" - తోసెయ్యబోయింది అనూరాధ.

"అలా అనకు - పోయినేడాది నువ్విలా లేవు. మీ రిద్దరూ ఒకరినొకరు పల్లెత్తు మాట అనుకోలేదెప్పుడూ. ఆవిడ చాదస్తానికి నవ్వటం తప్ప ఎన్నడూ విసుక్కోనైనా లేదు నువ్వు."

"అదంతా అయిపోయింది. ఈ ఏడాది నుంచీ ఆ ముసలమ్మ మమ్మల్ని పెట్టిన తిప్పలు తిప్పలుగావు. అదంతా తల్చుకుంటే నాకావిడ ముఖం చూస్తేనే ఒళ్ళు మండి పోతోంది" చల్లగాలి కూడా వేడెక్కి పోయేలా ముఖం ఎర్రగా చేసుకుంది అనూరాధ.

"ఏమయిందక్కా - అసలు సంగతేమిటో చెప్పు. నాతో చెప్పకోటానికేం. నాకు నువ్వు, నీకు నేనూ గాక మరింక మనకు మరో ఆడ తోడేముంది ? చెప్పక్కా" అనూరాధ చేతిని తన చేతిలోకి తీసుకుని లాలనగా అడిగింది పుణ్యవతి.

చిన్నతనానే తల్లీదండ్రీ చనిపోతే మేనమామ ఇంట పెరిగారు అక్కచెల్లెళ్లిద్దరూ. పరాయి పంచన చెల్లెలి మనసు ఎక్కడ నొచ్చుకుంటుందో అని వేయి కళ్ళతో కాచుకునేది కాస్త ఊహ తెలిసిన అనూరాధ.

తను చదువు మానుకునీ, పెళ్లి వాయిదా వేసీ చెల్లెలి చదువుకి ఏ ఆటంకమూ లేకుండా చేసింది.

'మా చెల్లెలు పెద్ద ఆఫీసరు' అంటూ గర్వంగా చెప్పకునే అక్కంటే ప్రాణం పుణ్యవతికి.

అనూరాధ మంచితనం మీదా, మనుషుల పట్ల అవ్యాజంగా ప్రేమ చూపించగల ఆమె స్వభావం మీదా ఎంతో గౌరవం పుణ్యవతికి.

అలాంటి అక్క ఇప్పుడు ఇలామారటం - నిస్సహాయంగా వున్న అత్తగారి మీద ద్వేషం పెంచుకోవటం, ఆమె మీది కోపంతో అక్క ముఖం కుంచించుకు పోవటం, ఆమె కళ్ళల్లో కసి పేరుకోవటం ఇదంతా పుణ్యవతికి బొత్తిగా నచ్చలేదు.

అక్క ఎలాగైనా ఈ సమస్య నుంచి బైటపడితే బాగుండుననుకుంది.

అనూరాధ తన చెల్లెలికి చెప్పటానికి తన కుటుంబాన్నీ, జీవితాన్నీ - ఏడాది నుంచీ జరుగుతున్న యుద్ధాన్నీ ఒక్కసారి పరామర్శించుకుంటున్న దానిలా నిశ్శబ్దంగా కూర్చుంది.

అనూరాధా, వీరమ్మా పదేళ్ళపాటు అత్తాకోడళ్ళుగా అన్యోన్యంగా కలిసి బతికారు.

వీరమ్మకు రజనీకాంతరావూ, శ్యామలమ్మ ఇద్దరే సంతానం. రజనీకాంతరావు ఏడుగురు మగపిల్లలు పుట్టి పోయాక వీరమ్మ నలభయ్యవయేట పుట్టాడు. అక్క శ్యామలమ్మకూ, అతనికీ పదిహేనేళ్ళు తేడా. వాళ్ళది అతి సామాన్య కుటుంబం. స్వంత భూమి సెంటుకూడా లేదు. దేవుడి మాన్యం నాలుగెకరాలు గవర్నమెంటు వేలంలో పాడుకుని సాగు చేసి పిల్లల్ని పెంచారు వీరమ్మ సుబ్బయ్యలు. ఆ పొలం సాగుకి వాళ్ళు పడ్డ కష్టాలు కష్టాలు కావు. ఆ పొలం మీద ప్రతి ఏడూ ఆశ పెట్టుకోటానికి కూడా లేదు. వాన కాస్త గట్టిగా కురిస్తే వురకెత్తుతుంది. నాలుగు చుక్కలు తక్కువ కురిస్తే ఎండిపోతుంది. రజనీకాంతరావు తనకు పదేళ్ళ వయసప్పుడు తనూ తండ్రీ కలిసి పొలం నుంచి బస్తాన్నర వడ్లు ఓ సాయంకాలం పూట ఎలా ఇంటికి మోసుకొచ్చారో అనేకసార్లు చెబుతుంటాడు. ఆ సంవత్సరమంతా పడ్డ కష్టానికి ఆ బస్తాన్నర వడ్లే దక్కుదల. ఎలా ఆ రోజుల్నీ, ఆ దరిద్రాన్నీ దాటారో విచిత్రమేనంటాడు.

అక్క శ్యామల టీచర్ ట్రైనింగయ్యి ఉద్యోగంలో చేరినపుడు కాస్త వూపిరి పీల్చుకున్నారు. కానీ అది తాత్కాలికమే అయింది. ఉద్యోగంలో చేరిన ఏడాదికే ఆమె పెళ్ళి కుదిరింది. ఆ పెళ్ళికి చాలానే అప్పయింది. రజనీకాంతరావు ఉద్యోగంలో చేరేసరికి అది వడ్డీతో సహా తడిసి మోపెడయింది. ఆ అప్పంతా తీర్చిగాని అతను పెళ్ళి చేసుకోలేదు. అందువల్ల అతను తన ముప్పై ఆరోయేట ముప్పయి ఏళ్ళ అనూరాధను పెళ్ళాడాడు. చెల్లెలి చదువుకోసం పెళ్ళి చేసుకోకుండా వున్న అనూరాధా తనకీ సంబంధం రావటం అదృష్టమనుకుంది.

కొడుక్కి ఉద్యోగం రాగానే సుబ్బయ్య, వీరమ్మ పట్నం వచ్చేశారు. పొలం చెయ్యటం మానేశారు. ఏటా దేవాదాయ శాఖ వాళ్ళు పెట్టే వేలం పాటలో తమ పేర పొలం పాడుకుని శిస్తుకట్టేవాళ్ళు. నలభైఏళ్ళ నుంచీ తమకింద వున్న భూమి, ప్రభుత్వం పట్టా ఇస్తుందనే ఆశ వుండేది. అందుకే దానికి ఏటా ఐదారొందలు ఖర్చుపెట్టేవారు.

రజనీకాంతరావు పెళ్ళయిన ఏడాదికే తండ్రి సుబ్బయ్య చచ్చిపోయాడు. దాంతో వీరమ్మకు వూరితో సంబంధాలు మరింత తెగిపోయాయి. ఏడాదికోసారి మేనల్లుడి పేర డబ్బు పంపి పొలం పాట తన పేర వచ్చినట్లు రశీదు తెప్పించుకునేది.

ఇలా ఏళ్ళు జరిగిపోయాయి. కొడుకూ కోడలూ తనను నెత్తిన పెట్టుకు చూసుకుంటున్నారని వీరమ్మ అందరితో చెప్పేది. నిజంగానే పదేళ్ళ పాటు అత్తాకోడళ్ళు ఏ పొరపొచ్చాలూ లేకుండా వున్నారు. ఎన్నడూ పరోక్షంలో కూడా ఒకరి నొకరు ఒక మాటనుకోలేదు.

అత్తగారి జ్ఞాపకశక్తినీ, తెలివినీ, ఆధ్యాత్మిక విషయాల గురించి ఆవిడ జ్ఞానాన్నీ అనూరాధ అందరి దగ్గరా పొగిడేది.

అయితే వీరమ్మకు ఎనభై ఎనిమిదేళ్ళు వచ్చేసరికి మనవళ్లకి పదేళ్ళూ, ఎనిమిదేళ్ళూ వచ్చాయి. హాయిగా పెరుగుతున్న మనవళ్ళనూ, వాళ్ళను ఖరీదైన స్కూళ్ళలో చదివించటానికి కొడుకు పడుతున్న తిప్పలనూ చూసిన వీరమ్మకు కొత్త ఆలోచన వచ్చింది.

ఇప్పుడు వూళ్ళో సాగర్ కాలవలొచ్చి పొలాలకు రేట్లు బాగా పెరిగాయి. ఎట్లాగైనా దేవుడి మాన్యానికి పట్టా సంపాదిస్తే నాలుగెకరాలకూ ఎంతలేదన్నా రెండు లక్షలు వస్తాయి. అది కాస్తా మనవలకిచ్చి కళ్ళు మూస్తే తన జీవితానికి ఓ సార్థకత వుంటుందని నమ్మింది.

ఆ నమ్మటం అట్లా ఇట్లా నమ్మలేదు. ఎనభై ఎనిమిదేళ్ళ ముసలావిడ హఠాత్తుగా వూరు ప్రయాణం కట్టింది. ఒంగిపోయిన శరీరం, చూపు సరిగ్గా ఆనదు. చెవిలో నోరు పెట్టి చెబితేగాని వినబడదు. కర్ర సాయంతో నిమిషానికి నాలుగడుగులు వేస్తుంది. ఆమెను ఊరెట్లా పంపుతామని గోలపెట్టాడు రజనీకాంతరావు.

తనకు రెండు రోజులకు మించి శలవు దొరకదు. పైగా ఆ పొలానికి పట్టా రాదని అతనికి ఖచ్చితంగా తెలుసు. ఆ పట్టా కోసం అతనూ కొంత ప్రయత్నం చేశాడు. డబ్బెవరికి

చేదు? ఓ రెండుమూడు వేలు తగలేశాక ఆ పట్టా వచ్చేది కాదని నిర్ణయించుకుని ఇక ఆ సంగతి ఒదిలేశాడు. ఆ విషయం వీరమ్మకు చెబితే వినిపించుకోలేదు. తను సాధించుకు వస్తానని మంకుపట్టు పట్టింది.

అత్తగారు ఇట్లా చిన్న పిల్లలా తంతు చెయ్యటం అనూరాధకు కొత్త.

"పోనీ పాపం పంపి చూడరాదా?" అంది రజనీతో అత్తగారి మీద జాలిపడుతూ. రజనీకాంతరావు అనూరాధ మీద యింతెత్తున లేచాడు. "ఆమెకు బుద్ధిలేకపోతే నీకూ లేదా? ఈ వయసులో ఎట్లా ప్రయాణం చేస్తుంది? మండలాఫీసు చుట్టూ, తాసిల్దారు చుట్టూ ఎట్లా తిరుగుతుంది? వాళ్ళేమైనా చెప్పినా ఈమెకు వినబడుతుందా? - పైగా ఆ వయసావిడను ఒక్కత్తెని అలా పంపితే వూళ్ళో నన్నేమనుకుంటారు?"

"నిజమే గదా" అనుకుంది.

పైగా ఖర్చులకి పదివేలు తెమ్మని కూర్చుంది వీరమ్మ. రజనీకాంతరావు ఏ నెల జీతం ఆ నెల ఖర్చు పెట్టుకునే సామాన్యుడు. పదివేలు ఒక్కసారిగా ఎక్కడ నుంచి తెస్తాడు?

అప్పు తెమ్మంటుంది వీరమ్మ.

ఇప్పటిదాకా అప్పులు తీర్చీ తీర్చీ విసిగిపోయాను. నా యవ్వనమంతా అప్పులకే ధారపోశాను. ఇక నేను అప్పు చెయ్యనంటాడు రజనీ.

రజనీ తన అభిప్రాయాలూ ప్రశ్నలూ అన్నీ అనూరాధతో చెబితే అనూరాధ అవి వీరమ్మతో అని, ఆవిడ సమాధానాలు రజనీతో చెప్పేది.

మొదట్లో ఈ పని ఆమె వినోదంగా చేసింది. తల్లీ కొడుకుల మధ్య రాయబారి పాత్ర సరదాగానే నిర్వహించింది. కానీ రాను రానూ రజనీ తల్లి గురించి తనకున్న కోపాన్ని అనూరాధ దగ్గర చెప్పటం, ఆమె దగ్గర నుంచి ఓదార్పు కోరటం చేస్తున్న కొద్దీ ఆమెకు సహజంగానే వీరమ్మ మీద కోపం వచ్చింది.

'ఏం మనిషి! ఇవతల తనను ఏ లోటూ లేకుండా పువ్వుల్లో పెట్టి చూసుకునే కొడుకు కష్టం గమనించకుండా మొండి పట్టు పడుతుంది' అని నిరసన భావం మొదలయింది.

క్రమంగా సమస్య ముదిరి పాకాన పడింది.

వీరమ్మ తొంభై ఏళ్ళు రాబోతుండగా మళ్ళీ ఒకసారి చిన్న పిల్లయింది. కొడుకు మీద అలిగింది. కొడుకు మామూలు కుశల ప్రశ్నలు వేసినా బదులివ్వటం లేదు. చివరికి అన్నం తినటం మానేసేదాకా వచ్చింది.

ఈ మొత్తం విషయంలో ఎక్కువ నలిగింది అనూరాధ. రజనీ తల్లిని కోపంగా అనే మాటలన్నీ తల్లితో అనేవాడు కాదు. అనూరాధతో అనేవాడు. అవన్నీ అనూరాధ తనంటున్నట్టు

వీరమ్మతో అనాలి. అట్లా అనమని రజనీ చెప్పేవాడు. రజనీ బాధ తగ్గించటంలో సహాయపడు తున్నాననుకుని అనూరాధ ఆ మాటలన్నీ అడిగేది.

"అక్కడే వుండి ఆ పొలం చేయించుకోక కొడుక్కి ఉద్యోగం రాగానే వుట్టి చేతుల్తో ఎందుకొచ్చారు?"

"నీ కొడుక్కి నువ్వేం యిచ్చావు? కొడుక్కి యివ్వని నువ్వు యిప్పుడు మనవలకి యివ్వనవసరం లేదు"

"నీ కొడుకు బతికే వున్నాడు. తన పిల్లల సంగతి చూసుకోగలడు. అప్పులన్నీ నెత్తినేసింది చాలదా? మళ్ళీ కొత్త అప్పు చేయించి నా పిల్లల గొంతు కోస్తావా?"

"ఊళ్ళో వాళ్ళందరి చేతా నీ కొడుకుని నానామాటలూ అనిపించటానికి కాకపోతే ఈ వయసులో ఒక్కతివీ ఎట్లా వెళ్తావు?" ఇలాంటి మాటలన్నీ రజనీ అన్నంత కోపంగానూ అనూరాధ అనేది.

వాటన్నిటికీ వీరమ్మ దగ్గర ఏవో సమాధానాలు వుండేవి. ఆమెను మాటల్లో ఓడించటం ఎవరితరమూ కాదు. చివరకు ఎప్పుడూ తనే ఓడిపోతుండేసరికి అనూరాధకు వీరమ్మ మీద అంతులేని కసి పెరిగేది. మనసులో తిట్టుకునేది.

మూడు నెలల పాటు సాగిన ఈ పోరాటంలో పెద్ద నష్టం జరిగింది కూడా అనూరాధకే.

ఆమె ముఖంలో ఎప్పుడూ తొణికిసలాడే చిరునవ్వూ, నిర్మలత్వం మాయమయ్యాయి. ఒక మనిషి మీద నిత్యం తన గుండెలో పెరుగుతున్న కోపం ఆమె నరాలను దుర్బలపరచింది. ఆమె ముఖాన్ని కఠినంగా మార్చింది. ఆమెలో ఎన్నడూలేని చికాకుని తెచ్చి పెట్టింది.

ఇక ఈ చివరి నిరశన దీక్ష సంగతి తెలిసి రజనీకాంతరావు అక్క శ్యామలమ్మ తల్లిని చూడవచ్చింది. చూసి కళ్ళనీళ్ళు పెట్టుకుంది. తల్లి ఆరోగ్యమేమవుతుందని బెంగపడింది.

తమ్ముడు వచ్చాక "అమ్మని ఊరు పంపించరా లేకపోతే ఆమె బతకదు" అంది.

"నా దగ్గర డబ్బులేదే" అని మూలిగాడు రజనీ. "అప్పు చెయ్యి తప్పేదేముంది" ఉచిత సలహా యిచ్చేసింది అక్క.

"ఇప్పటికిప్పుడు పది వేల అప్పు నాకెక్కడ దొరికేను?" అలమటించాడు రజనీ.

"పోనీ నేను యిప్పిస్తాలే. నెమ్మదిగా తీర్చు"

శ్యామలమ్మ పదివేలు అప్పుయిచ్చి తన కొడుకుని తోడిచ్చి వీరమ్మను వూరు పంపింది. వీరమ్మ తన మేనల్లుడి యింట్లో దిగి వాళ్ళను రెవిన్యూ ఆఫీసుల చుట్టూ పరిగెత్తించింది. తనూ స్వయంగా తిరిగింది.

ఐతే వీరమ్మ వూరెళ్ళిన దగ్గర్నించీ రజనీకాంతరావుకి వూరు నుండి వారానికి నాలుగుత్తరాలకు తక్కువ కాకుండా వచ్చేవి.

ఈ వయసులో పొలం తెమ్మని ముసలమ్మని అలా పంపటం అమానుషమనీ -

ముసలమ్మ బరువయిందా? తిండి పెట్టటం దండగని వూరికి పంపావా అనీ -

కోడలు చెయ్యనందా? తొంభై ఏళ్ళ ముసలిదాన్ని ఇంట్లోంచి వెళ్ళగొట్టిన కోడలు రాక్షసిగాక మరేమిటనీ -

రకరకాలుగా బంధువులంతా తమ తమ అభిప్రాయాలు ప్రకటించారు. అవి రజనీ చదివి అవతల పారెయ్యకుండా అనూరాధకు కూడా వినిపించి ఆమె ఒళ్ళో తల పెట్టుకుని ఏడ్చేవాడు. అనూరాధకు, భర్త దుఃఖాన్ని చూసే కొద్దీ అత్త మీద కోపం పెరిగేది. మొత్తం మీద వీరమ్మను ద్వేషించే స్థితికి వెళ్ళింది అనూరాధ. నాలుగు నెలలు గడిచాయి. ఆ పదివేలూ అయిపోయాయి. పొలం పట్టా రాలేదు. వీరమ్మ ఆరోగ్యం సర్వనాశనం చేసుకుని తిరిగొచ్చింది.

పుల్లలా వచ్చిన తల్లిని కావలించుకుని రజనీ "ఇట్లా అయిపోయావేమిటే" అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

" మా అమ్మ చూడు ఎలాగైందో" అన్నాడు దిగులుగా అనూరాధతో.

"బుద్ధీ జ్ఞానం లేకపోతే ఏమవుతుంది మరి?" అంది అనూరాధ తన కోపపు ధోరణిలో.

"అదేంటి అలా అంటావు. మా అమ్మకున్న తెలివి ఎవరికీ లేదు. ఆవిడ తెలివిలో సగమున్నా నువ్వు బాగుపడేదానివి" అని తల్లిని ముద్దు చేశాడు.

"ఏంటో అన్నాళ్లు తాగిన నీళ్ళు యిప్పుడు పడకొచ్చాయి. ఒళ్ళు నాశనం అయింది. పదివేలు నాశనం చేశాను. పట్టా రాదంటున్నారు" బెరుకు బెరుగ్గా చెప్పింది వీరమ్మ.

పదివేలతోనైనా తల్లికి పట్టా పిచ్చి వదిలిందని సంతోషించాడు రజనీకాంతరావు.

ఆ సంతోషంలో అనూరాధను పిల్చి-

"అమ్మ ఆరోగ్యం జాగ్రత్త. డాక్టర్ని రమ్మని కబురు చేస్తాను. నే లేనప్పుడు వస్తాడేమో - అన్నీ వివరంగా చెప్పి మందులూ టానిక్కులూ రాయమను. పాలూ, పళ్ళూ అన్నీ వేళ ప్రకారం యివ్వు. నెలరోజుల్లో ఆమె పూర్వంలాగా తయారవ్వాలి" అని ఆజ్ఞలు జారీ చేశాడు.

కొడుకు మంచితనానికి మురిసిపోతూ " మా నాయనే" అని మెటికలు విరిచి ముద్దుచేసింది వీరమ్మ. ఇప్పుడు అనూరాధ ఆమెకు సేవలు చెయ్యాలి.

ఎనిమిది నెలలుగా ఎవరి మీద ద్వేషం పెంచుకున్నదో ఆమెకు సేవలు చెయ్యాలి..

కొడుకు అప్పుడు తన కోపమూ ఆమె మీద సూటిగా చూపలేదు. ఇప్పుడు సేవలూ స్వయంగా చెయ్యడు. తన కోపాన్నీ ప్రేమనూ కూడా అనూరాధ ద్వారానే చూపిస్తాడు.

అనూరాధ ఎప్పుడేది చూపించమంటే, అప్పుడది చూపటానికి మరబొమ్మ కాదుగదా- మనసున్న మనిషాయె.

ఆమెకు అత్తగారి మీద మనసులో పేరుకున్న కోపం సేవలు చెయ్యాల్సి వచ్చేసరికి ఎక్కువయ్యింది.

ఎనిమిది నెలల ముందు అత్తగారి మీదున్న ప్రేమ, గౌరవం కనుచూపు మేరలో లేవు. రెండు నెలలు గడిచేసరికి వీరమ్మ వునికి అనూరాధకు దుర్భరమైపోయింది. వీరమ్మ పిలుపూ, మాటా, దగ్గూ, మూలుగూ ఏదీ భరించలేకపోయింది. విపరీతమైన అశాంతిని అనుభవిస్తోంది.

ఈ విషయాన్నంతా అనూరాధ ఆ వెన్నెల రాత్రి చెల్లికి తన మాటల్లో చెప్పింది. వీరమ్మ చేసిన తెలివి తక్కువ పనీ, వూళ్ళో వచ్చిన అప్రదిష్ఠ, పదివేల అప్పూ, తనకొచ్చిన కష్టం అన్నీ చెప్పుకుని చెల్లి ఒళ్ళో చేరి బావురుమంది.

పుణ్యవతి అక్క వీపు నిమురుతూ ఆలోచించింది. ఆలోచించగా ఆలోచించగా ఆమెకు అసలు సూత్రమేదో దొరికినట్లయింది.

అక్క దుఃఖం వుపశమించాక, ఆమెను లేపి కళ్ళ నీళ్ళు తుడిచి, కాటుక మరకలు తుడిచి అక్కున చేర్చుకుంది.

"అక్కా మరింత గొడవ జరిగినా బావ తన తల్లంటే ప్రేమగానే వుంటున్నాడే-వాళ్ళ మధ్య ఏ గొడవా లేనట్టే వుంది?"

"ఆయనో పిచ్చి మారాజు. తల్లంటే ఎక్కడ లేని ప్రేమ" మూతి విరిచింది అనూరాధ.

"ఆయన కాదు పిచ్చిమారాజు. నువ్వే పిచ్చిమాతల్లివి. అసలు తల్లీ కొడుకుల వ్యవహారంలో నువ్వెందుకు జోక్యం చేసుకున్నావు?"

"అదేంటి - నేనేం చేశాను" చెల్లి ధోరణికి కంగారు పడింది.

"నువ్వుగాక మరెవరు. నువ్వు చెప్పినదాన్ని బట్టి నాకు అర్థమైనంతవరకు ఆమెని అన్ని మాటలూ నువ్వే అన్నావు గానీ మీ ఆయన అనలేదుగా. ఆ మాటలన్నీ మీ ఆయన అన్నవేగా? అవి నీచేత అనిపించకుండా ఆయనే అని వుంటే సరిపోయేదిగా"

"మా యిద్దరిలో తేడా ఏముంది?" అయోమయంగా అడిగింది అనూరాధ.

"పిచ్చి అక్కా-తేడా ఎందుకు లేదు? వుంది. తేడా లేకపోతే ఆయనే అనొచ్చుగా. అనడు. ఆయనకూ ఆవిడకూ వున్న సబంధం వేరు. నీకూ ఆవిడకూ వున్న సంబంధం వేరు. ఇది వాస్తవం. ముందు దాన్ని గమనించు. అర్థం చేసుకో. వాళ్ళు ఓ మాట అనుకున్నా సర్దుకునే వాళ్ళేమో. నువ్వు ఆమెని మీ ఆయన అడగమన్న మాటలన్నీ అడిగి, ఆ క్రమంలో ఆమెని ద్వేషించావు. ఆ మాటలన్నీ నువ్వు నమ్మావు. ఆయన నమ్మలేదు. ద్వేషించే మనిషికే సేవలు చెయ్యాల్సి వచ్చేసరికి నీకు నరకంగా వుంది. ఈ సేవలు మీ ఆయన చెయ్యడు. ఆయన రెండు మెరమెచ్చు మాటలు చెప్పి తప్పుకుంటాడు. నిన్నొక స్థితిలో పడేశాడు. కనీసం దాన్నించి నిన్ను

బైటికి తెచ్చే ప్రయత్నమన్నా చెయ్యలేదు. నువ్వు క్రమంగా మానవత్వాన్ని కోల్పోతున్నావు. నవ్వుతూ మాట్లాడాల్సిన ముసలావిడతో కసురుకుంటూ, చీదరించుకుంటూ మాట్లాడుతున్నావు.

ఈ మగాళ్ళు ఆడవాళ్ళని అమానుషంగా తయారు చేయటంలో, వాళ్ళలో సున్నితత్వాన్ని చంపి బండగా తయారు చేయటంలో బహు నేర్పరులు.

ఒకసారి మా ఆయన కూడా తనకు నచ్చని విషయాన్ని నా ద్వారా మా అత్తగారికి చెప్పించటానికి ప్రయత్నించాడు. నేను చెప్పనని ఖచ్చితంగా చెప్పాను. నా యిబ్బందులు నా పద్ధతిలో నేనావిడతో చెప్పుకుంటాను. ఆయన విషయాలు నెత్తినేసుకుని నేనెందుకు అశాంతి పడాలి? కుటుంబంలో అందరి శారీరికావసరాలూ మనమే తీరుస్తాం, చాకిరీ చేసి - దానికి తోడు అందరి మానసిక అశాంతులూ కోపతాపాలూ మన నెత్తినే వేసుకుంటే మనం బండబారిపోతాం. రాతి మనుషుల మవుతాం" చెల్లెలు మాట్లాడుతున్న కొద్దీ అనూరాధకు జరిగినదేమిటో, తను కోల్పోయినదేమిటో తెలిసి వచ్చింది.

'ఆ కఠినమైన మాటలు అత్తతో తనెందుకు మాట్లాడింది. భర్తనే ఎందుకు మాట్లాడమనలేదు?

అతను తల్లితో తన సంబంధాన్ని కాపాడుకుంటే తను తోటి ఆడదానితో వున్న మంచి సంబంధాన్నీ, స్నేహాన్నీ చేతులారా పాడు చేసుకున్నదే!

నిజానికి అత్తగారి ఈ మంకుతనం వల్ల తనకు ప్రత్యేకంగా ఏం నష్టం జరిగింది?

రజనీకాంతరావుకి తల్లి మీద వచ్చిన కోపానికి వాహికగా నిలవటానికి తనెందుకు అంగీకరించింది?

అనాలోచితంగా చేసిన ఆ పని మొత్తం తన వ్యక్తిత్వాన్నే మార్చేసిందే.

ఇట్లాగేనా అత్తా కోడళ్ళ మధ్య సంబంధాలు పాడయ్యేది'.

అనూరాధ తన మనసులోని కోపం, కల్మషం కరిగిపోయేలా పెద్ద పెట్టున ఏడ్చింది.

అక్కను సముదాయిస్తూ అక్క కోసం తనూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది పుణ్యవతి.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 26-6-94*